సాక్షి ప్రకాశం

గురువారం ¦ 9 ¦ జనవరి ¦ 2025



32 ఊళ్లు.. అడుగుతున్నాయ్ నీళ్లు

మద్దిపూడి మండలంలో 32 గ్రామాలకు తాగునీరందించే సీపీడబ్ల్యూ స్కీం కాంట్రాక్టు ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో సిబ్బంది విధులు బహిష్కరించారు. - 8లో..



రూ.కోట్ల భూమిని కాజేశారు

సంతనూతలపాడు-ఒంగోలు సరిహద్దుల్లో పేర్నమిట్ట శివారుల్లో ఉన్న ప్రభుత్వ భూమిపై టీడీపీ నేత కన్ను పడింది. భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం **30/21**

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.









తనివి తీర విహారం !

ఎగిసిపడే కెరటాల చెంత రివ్వున సాగుతూ సందడి చేస్తున్నాయి విదేశీ విహంగాలు. సాగరంలో అలల సోయగాలు ఒకవైపు.. తీరంలో విదేశీ అతిథుల సందడి మరో వైపు.. పక్షుల కిలకిల రావాలతో తీరం సందడి సందడిగా మారింది. టంగుటూరు మండలం పసుకుదురు కడలి తీరం జన సంచారంలేని ప్రాంతంలో విదేశాల నుంచి వచ్చిన పక్షులు తనివితీరా విహరించాయి.

- ఫొటోలు : ఎం.ప్రసాద్, ఒంగోలు



న్యూస్‌రీల్

21 మందికి ఆర్‌ఐలుగా పదోన్నతి

ఒంగోలు అర్బన్: రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న 21 మంది ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో ఆర్ఐ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్)లుగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ రకాల డిపార్టుమెంట్ పరీక్షలు, శిక్షణలు పూర్తి చేసిన జూనియర్ అసిస్టెంట్‌లకు సీనియారిటీ మేరకు పదోన్నతులు కల్పించారు.

ఏకేయూ వీసీని కలిసిన ఎస్బీఐ ఆర్‌ఎం



వీసీ మూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్బీఐ రీజనల్ మేనేజరు గున్నేశ్వరరావు

ఒంగోలు సిటీ: భారతీయ స్టేట్ బ్యాంకు ఒంగోలు రీజనల్ మేనేజర్ ఎస్.గున్నేశ్వరరావు బుధవారం సాయంత్రం ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రొఫెసర్ మూర్తికి బ్యాంకు డైరీ, క్యాలెండర్లు అందజేశారు. ఆయన వెంట ఒంగోలు ఆర్.ఎం.సి.ఏ. సునీల్‌కుమార్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి జానకిరామయ్య, గుర్తింపు పొందిన కళాశాలల యాజమాన్యాలు, ప్రధానాచార్యులు వీసీ ప్రొఫెసర్ మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తుత్తి కారిడార్..!

దొనకొండ పారిశ్రామిక కారిడార్.. దశాబ్దకాలంగా వినిపిస్తున్న మాట..ఇప్పటి వరకూ ఒక్క అడుగు ముందుకు పడితే ఒట్టు.. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. ఐదేళ్లు ప్రకటనలకే పరిమితమయ్యారు. తాజా ఎన్నికల ముందు కూడా చంద్రబాబు దొనకొండ రూపురేఖలు మార్చేస్తామంటూ హామీలు గుప్పించారు. ఏడు నెలలు గడుస్తున్నా పరిశ్రమల ఏర్పాటుపై ఎలాంటి ప్రస్తావన లేదు సరికదా విమానాశ్రయం పేరుతో మాత్రం హడావుడి చేస్తున్నారు.

- దొనకొండ పారిశ్రామిక కారిడార్ ప్రకటనలకే పరిమితం
- 2104 నుంచి చంద్రబాబు పూటకో ప్రకటన
- 2019 ఎన్నికల ముందు శంకుస్థాపనల డ్రామా
- తాజాగా విమానాశ్రయం అంటూ హడావుడి
- వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు అంటూ హంగామా



పరిశ్రమల కోసం ఖాళీగా ఉన్న భూములు

యువతకు ఉపాధి కల్పించాలి



దొనకొండ ప్రాంతంలో వేల ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలి. దొనకొండ ప్రాంతం వెనుకబడింది. ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టుకుని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కరించవచ్చు.

- షేక్.అమీర్, దొనకొండ

అవకాశం మెండు... ఆచరణ మాత్రం లేదు



దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మాత్రం దొనకొండ ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకోలేదు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు తయారైంది దొనకొండ. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని గతంలో విదేశీయులు దొనకొండకు వచ్చారు, వెళ్లారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య నిర్మూలించాలి.

- చిరుపల్లి అంజయ్య, దొనకొండ

దొనకొండ: దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు పత్తా లేకుండా పోయాయి. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం, నిరుద్యోగ సమస్య నిర్మూలిస్తాం, అభివృద్ధికి కృషి చేస్తామంటూ 2024 ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టేలా ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చాక ఆ మాటలు నీటిలో మూటలుగా మిగిలిపోయాయని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. 2014 సంవత్సరంలో అసెంబ్లీ వేదికగా దొనకొండను పారిశ్రామికవాడగా మారుస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దొనకొండ మండలంలో 21 గ్రామాల్లోని 25,886 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ తర్వాత 2016లో విశాఖలో నిర్వహించిన సమావేశంలో విదేశీయులతో ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించింది. చైనా, ఉక్రెయిన్, స్పెయిన్ దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలను తీసుకొచ్చి హడావుడి చేసింది. కొచ్చర్లకోట, మల్లంపేట, సిద్ధరాయపాలెం, ముంగినపూడి, ఇండ్లచెరువు, పోచమక్కపల్లి, వద్దిపాడు తదితర గ్రామాల్లో సుమారు ఆరు వేల ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటనలు చేసింది. ఇది ప్రాథమిక సర్వే అంటూ ప్రకటించింది. ఆ తర్వాత అవన్నీ కాకిలెక్కలుగా మిగిలిపోయాయి. రికార్డులు మాత్రం భద్రంగా ఉన్నాయి. పారిశ్రామికవాడకు సంబంధించి అప్పటి మంత్రులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేశారే తప్ప ఒరిగిందేమీ లేదు. ఇలా ఐదేళ్లు టీడీపీ ప్రభుత్వ కాలక్షేపం చేసింది. 2019 ఎన్నికల ముందు ఏపీఐసీసీ ముందు అప్పటి మంత్రులు శిలాఫలకం ఆవిష్కరణ డ్రామా ఆడారు.

విమానాశ్రయం అంటూ హంగామా..

దొనకొండలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆర్భాట ప్రకటనలు చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు అభివృద్ధికి వెయ్యి ఎకరాలు కేటాయిస్తున్నామని ప్రభుత్వ ప్రకటనలు కూడా చేసింది. దీనిపై నివేదికలు సిద్ధం చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించింది. ఆమేరకు వారు ఈ ప్రాంతాల్లో పర్యటించిని నివేదికలు సిద్ధం చేస్తున్నాంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నారు. 2014లోనూ ఇదే తరహాలో హడావుడి చేశారు. కారిడార్‌కు అనుసంధానంగా విమానాశ్రయం ఏర్పాటు కోసం అధికారులు దొనకొండలోని పాత విమానాశ్రయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఇక్కడ 15 సీట్ల మినీ విమానాలు రన్‌వేపై దిగడానికి సౌకర్యవంతమని ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి గన్నవరం ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారుల బృందం కూడా విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించింది. ఉన్న 136 ఎకరాలతోపాటు మరో 340 ఎకరాల భూమి అవసరమని గుర్తించింది. రెవెన్యూ అధికారులు నరసింహనాయునిపాలెం, ఇండ్లచెరువు రెవెన్యూ పరిధిలోని 340 ఎకరాల భూములను అప్పట్లో ఎంపిక చేశారు. మొత్తం 1,575 మీటర్ల పొడవున రన్‌వే ఏర్పాటుకు ప్రాథమిక సర్వే చేపట్టారు. అంతేకాకుండా ఢిల్లీ ఎయిర్‌పోర్టు సర్వే విభాగం అధికారల బృందం కూడా వారం రోజుల పాటు సర్వే చేసింది. అయితే వారు ఇచ్చిన నివేదికలు ఏమైపోయాయో తెలియదు. తాజాగా విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నామంటూ కూటమి ప్రభుత్వం సరికొత్త డ్రామాకు తెరతీసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



దొనకొండ విమానాశ్రయం

ఎన్ని రోజులున్నా..మా బతుకులు ఇంతే..

ప్రభుత్వ భూములు మండలంలో అధికంగా ఉన్నా పరిశ్రమలు నెలకొల్పడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎన్ని రోజులున్నా మా బతుకులు ఇంతే అంటూ ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాంతాన్ని పరిశ్రమలతో అభివృద్ధి పరిచి నిరుద్యోగ సమస్య నిర్మూలిస్తామన్న మాట కాకి లెక్కలతో సరి పెడుతున్నారని ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు.

ముందుకు రాని విదేశీయులు..

దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు రోజుకో మాట, పూటకొక అబద్ధం చెప్తూ వస్తుండడంతో విదేశీయులు ముందుకు రావడంలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం, మీ సమస్యలు తీరుస్తాం అంటున్నారే కానీ, ఆచరణ మాత్రం అర కిలోమీటరు దూరంలో ఉందని ఈ ప్రాంత ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి కాలయాపన తప్ప, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంతం అభివృద్ధి చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని ప్రజలు అంటున్నారు.

సాధన ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జాబిల్లి జిలుగులు

ఒంగోలు సిటీ: ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విజయవాడలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా నుంచి ఆరు ప్రాజెక్టులు పాల్గొన్నట్లు తెలిపారు. వీటిలో ఒకటి టీచర్ ఎగ్జిబిట్ కింద 'జాబిల్లి జిలుగులు' ప్రాజెక్టు, వ్యక్తిగత ఎగ్జిబిట్ కింద 'స్మార్ట్‌పోల్' ప్రాజెక్టు ఎంపికయ్యాయన్నారు. ఎంపికైన విజేతలను డీఈఓ కిరణ్‌కుమార్, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ అభినందనలు తెలిపారు. పాండిచ్చేరి లో జరిగే సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ కు 35 ప్రాజెక్టులు ఎంపిక కాగా, ఇందులో జిల్లాకు చెందినవి రెండు ప్రాజెక్టులు ఉన్నట్లు తెలిపారు.

టీచర్ ప్రాజెక్టు..

ప్రాజెక్టు పేరు: జాబిల్లి జిలుగులు (చంద్రయాన్-3)



బహుమతి అందుకుంటున్న 'జాబిల్లి జిలుగులు' ప్రాజెక్టు టీచరు కాకి స్వర్ణలత

స్కూల్ పేరు: ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగులుప్పలపాడు మండలం.

ప్రాజెక్టు సారాంశం:

ఇస్రో వెల్లడించిన వివరాల ప్రకారం చంద్రయాన్-3 ప్రయోగంలో ఏం కనుగొన్నారు, వాటి ప్రయోజనం, వాటి వివరణలు గురించి తెలుసుకోవడం.

- చంద్రుని దక్షిణ ధృవంపై ల్యాండర్ సాఫ్ట్ ల్యాండ్ అవడం
- ల్యాండర్, రోవర్‌లు చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు చేసి మనకు పేలోడ్ల ద్వారా ప్లాస్మా కొలత, సాంద్రతల గురించి, ఉష్ణోగ్రతలో మార్పులు, సల్ఫర్ గుర్తింపు, వాటితో పాటు మిగిలిన మూలకాలు ఉన్నట్లు గుర్తించడం.
- చంద్రుని పైన జరిగిన మార్పులకు ఇస్రో వాళ్లకు నివేదికను సమర్పించడం.



బహుమతి అందుకుంటున్న స్మార్ట్‌పోల్ ప్రాజెక్టు విద్యార్థిని కీర్తన, గైడ్ టీచరు శ్రీలక్ష్మి కామేశ్వరి

వ్యక్తిగత ఎగ్జిబిట్:

ప్రాజెక్టు పేరు: 'స్మార్ట్ పోల్'

గైడ్ టీచర్: పి.శ్రీలక్ష్మి కామేశ్వరి

విద్యార్థిని పేరు: డి.కీర్తన, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మార్కాపురం

స్మార్ట్‌పోల్ సారాంశం:

స్మార్ట్‌పోల్ అంటే సాధారణంగా ఉపయోగించే వీధిదీపాల స్తంభాల స్థానంలో సౌరశక్తిని ఉపయోగించి పని చేసే ఎల్‌ఈడీలు, వైఫై రూటర్, సర్వైలెన్స్ కెమెరాలు, డిజిటల్ సైన్‌బోర్డులు, వాతావరణ సెన్సార్లు, ప్రజలను అప్రమత్తం చేసే స్పీకర్లు, విద్యుత్ తో నడిచే వాహనాలకు ఛార్జర్లు కలిగి ఉన్న స్తంభాలను ఏర్పాటు చేయాలి.

ఉపయోగాలు:

- పట్టణాల్లో అన్ని రకాల పరికరాలను ఒకే కేంద్రీకృత వ్యవస్థతో అనుసంధానం చేయడం వల్ల పౌర సేవలను వేగవంతం చేయవచ్చు.
- రవాణా వ్యవస్థను సమర్థవంతంగా చేయవచ్చు.
- కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించవచ్చు.
- పల్లెల్లో కూడా వాతావరణ సెన్సార్లను వ్యవసాయ రంగంలో ఉపయోగించవచ్చు.
- ఎలక్ట్రిక్ కార్లు, బైకులను రోడ్డుపైనే చార్జింగ్ చేయవచ్చు.

నియామకానికి కృతజ్ఞతలు



చెవిరెడ్డి భాస్కరరెడ్డికి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్

- చెవిరెడ్డి, చుండూరు ను మర్యాదపూర్వకంగా కలిసిన మైనార్టీ అధ్యక్షుడు సుల్తాన్

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన షేక్ సుల్తాన్ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు లను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి అనంతరం బొకేలు అందజేశారు.

క్లుప్తంగా

భైరవకోన హుండీ ఆదాయం రూ.6.54 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న ఈఓ, సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలోని భైరవేశ్వరస్వామి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కించినట్లు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. గడిచిన 2 నెలల 10 రోజుల వ్యవధిలో హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.6,54,390 ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ల శ్రీనివాసరాజు, ఆవుల వెంకటసుబ్బయ్య, రణధీర్‌వర్మ, అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి బ్రాంచ్ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం



కురిచేడు: మండల కేంద్రమైన కురిచేడు సమీపంలోని నాగార్జున సాగర్ దర్శి బ్రాంచ్ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం ఉదయం పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ఉబ్బి గుర్తించేందుకు వీల్లేకుండా ఉంది. మృతదేహంపై నల్లని ప్యాంటు, గులాబీ రంగు చొక్కా ఉంది. మృతుని వయసు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందని అంచనా. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ తెలిపారు. ఎవరైనా మిస్సింగ్ అయితే కురిచేడు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అర్ధవీడు: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం అర్ధవీడు మండలంలోని బొమ్మిలింగం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యేసురాజు నాయక్(45) గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతికి పూర్తి కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించనున్నట్లు తెలిపారు.

రోగులతో మర్యాదగా ప్రవర్తించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: వైద్య చికిత్స కోసం ప్రాథమిక వైద్యశాలకు వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం జిల్లా మలేరియా కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా కేసులను గుర్తించిన వెంటనే వైద్యాధికారికి, జిల్లా మలేరియా అధికారికి తెలియజేయాలని చెప్పారు. రక్త పరీక్షల వివరాలను ఏరోజుకారోజు ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లోని ఎల్-ఫారంలో నమోదు చేయాలని సూచించారు. మాసాంతపు నివేదికలను ఎం-4 ఫారంలో నమోదు చేయాలన్నారు. అన్ని రకాల పరీక్షలను సక్రమంగా చేయాలని ఆదేశించారు. డీఎంఓ డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. రక్త పరీక్షల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఏఎంఓ శ్రీనివాసులు, ఎస్‌యూఓ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సులు, అటెండర్ పోస్టులకు నోటిఫికేషన్

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిమేల్ నర్సింగ్, శానిటరీ అటెండర్ పోస్టుల భర్తీకి అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) పద్ధతిలో నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 18వ తేదీలోపు దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని పేర్కొన్నారు. నోటిఫికేషన్ దరఖాస్తు, సర్వీస్ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ నమూనా పత్రాలను ప్రభుత్వ జిల్లా వెబ్ సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

32 ఊళ్లు అడుగుతున్నాయ్ నీళ్లు

మంత్రి డీబీవీ స్వామి ఇలాకాలో మూడు రోజులుగా తాగునీటి ఇక్కట్లు

- సీపీడబ్ల్యూ స్కీమ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు 6 నెలలుగా అందని వేతనం
- విధులు బహిష్కరించి ధర్నాకు దిగిన కాంట్రాక్ట్ సిబ్బంది
- మర్రిపూడి మండలంలో 32 గ్రామాలకు నిలిచిన రామతీర్థం నీటి సరఫరా

మర్రిపూడి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. మర్రిపూడి మండలంలో గత మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి మండలంలో 32 గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకం సిబ్బందికి వేతనం మంజూరు చేయకపోవడమే తాగునీటి సమస్యకు ప్రధాన కారణం.

ఆరు నెలలుగా అందని వేతనం

మండలంలో రక్షిత మంచి నీటి పథకం పరిధిలో 11 మంది కాంట్రాక్ట్ సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి 6 నెలలుగా జీతం నిలిచిపోవడంతో విధులు బహిష్కరించి 32 గ్రామాలకు తాగునీటి సరఫరాను నిలిపివేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

నీటి సరఫరాలో కూటమి సర్కారు విఫలం

మర్రిపూడి మండలం అత్యంత వెనుకబడినదిగా అధికారులే గుర్తించారు. ఈ మండల ప్రజలకు రామతీర్థం జలాలు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. కాంట్రాక్టర్లుగా అవతారమెత్తిన కూటమి సానుభూతిపరులు రోజూ మండల ప్రజలకు తాగునీటిని సరఫర చేసే కాంట్రాక్ట్ సిబ్బందికి 6 నెలలుగా వేతనం నిలిపేశారు. దీంతో కడుపు మండిన సిబ్బంది రామతీర్థం జలాల పంపిణీని గ్రామాలకు బంద్ చేశారు. వేతనం ఇప్పించాలంటూ బుధవారం స్థానిక సీపీడబ్ల్యూ స్కీం వద్దే ధర్నాకు దిగారు. గత 6 నెలలుగా తమతో చాకిరీ చేయించుకుంటూ వేతనం నిలిపేస్తే పండుగ పూట పస్తులు ఉండాలా అని ప్రశ్నిస్తున్నారు. దుకాణాల వద్దకు వెళ్తే అప్పు కూడా పుట్టడం లేదని వాపోయారు. జీతం అడుగుతున్నామని చెప్పి తమను తొలగించి మరొకరిని ఏర్పాటు చేసుకోవడం అన్యాయమని, న్యాయం జరిగేంత వరకు పోరాడతామని ముక్త కంఠంతో పేర్కొన్నారు.

వైఎస్సార్ పుణ్యాన రామతీర్థం

ప్రకాశం జిల్లా వాసులను ఫ్లోరైడ్ కబళిస్తున్న తరుణంలో సురక్షిత తాగునీరు అందించేందుకు నాటి సీఎం దివంగత వైఎస్సార్ పూనుకున్నారు. చీమకుర్తి సమీపంలో వైఎస్సార్ నిర్మించిన రామతీర్థం రిజర్వాయర్ నుంచి మర్రిపూడి మండలం మీదుగా కనిగిరి, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాలకు తాగునీరు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.91 కోట్లు కేటాయించారు. అందులో భాగంగా మర్రిపూడి గ్రామ శివారులో రూ.5 కోట్లు వెచ్చించి, రక్షత మంచి నీటి పథకం ఏర్పాటు చేశారు. ఫిల్టర్‌బెడ్లు, గ్రౌండ్ ఫ్లోర్, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మించారు. రోజూ 2 లక్షల లీటర్ల తాగునీరు శుద్ధి చేసి, పైపులైన్ ద్వారా మర్రిపూడి మండలంలోని 32 గ్రామాల ప్రజలకు శుద్ధ జలాలు అందించి దాహం తీర్చారు.



తాగునీరు నిలిచిపోయిన గ్రామాల మ్యాప్


మర్రిపూడిలో వైఎస్సార్ హయాంలో నిర్మించిన సీపీడబ్ల్యూ స్కీం


రక్షిత పథకం వద్ద బకెట్‌తో నీరు తోడుకుంటున్న మర్రిపూడి వాసులు


రెండో రోజు ధర్నాకు దిగిన సీపీడబ్ల్యూ స్కీం కాంట్రాక్ట్ సిబ్బంది

రూ.60 వేలు బకాయి రావాలి



సీపీ డబ్ల్యూ స్కీంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నా. గత 6 నెలలకు సంబంధించి రూ.60 వేలు జీతం నిలిచిపోయింది. సంక్రాంతి పండుగ వచ్చిందని చిల్లర దుకాణాల వద్దకు పోతే అప్పు ఇవ్వమంటున్నారు. జీతం లేకుండా ఎలా జీవించాలి. వెంటనే బకాయిలు ఇవ్వాలి.

– ఎ.తిరుమలరావు, షిఫ్ట్ ఆపరేటర్, మర్రిపూడి

జీతం ఇచ్చే వరకు ధర్నా కొనసాగిస్తాం



జీతం అడిగితే ఎవరి నుంచి కూడా సమాధానం రావడం లేదు. అందువల్ల విధులు బహిష్కరించి, మండలంలోని 32 గ్రామాలకు తాగునీటి నిలిపివేశాం. ఈ స్కీమ్‌లో పనిచేసే టి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహరావు, పి.వెంకటేశ్వర్లు, పి.రోశయ్య, జి.శ్రీను, పి.శ్రీను పోతులూరయ్య, తిరుమలరావు తదితరులతో కలిసి ధర్నా చేపట్టాం. మాకు రావాల్సిన బకాయిలు ఇవ్వాలి.

– పాలడుగు నాగేశ్వరరావు, సీపీడబ్ల్యూ స్కీమ్ కాంట్రాక్ట్ ఉద్యోగి, పన్నూరు

రూ.కోట్ల భూమిని కాజేశారు


పేర్నమెట్ట రెవెన్యూ సదస్సులో అర్జీ ఇస్తున్న పట్టాదారులు


సంతనూతలపాడు-ఒంగోలు సరిహద్దు వద్ద భూమిని జేసీబీతో చదును చేస్తున్న ఆక్రమణదారులు

- డొంక, చుక్కల భూములపై అధికార పార్టీ నేత కన్ను
- సంతనూతలపాడు ఒంగోలు సరిహద్దు వద్ద రూ.కోట్ల విలువైన భూ ఆక్రమణ

సంతనూతలపాడు: ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు టీడీపీ నేతలు గద్దల్లా వాలిపోతున్నారు. సంతనూతలపాడు- ఒంగోలు సరిహద్దుల్లోని పేర్నమిట్ట గ్రామ శివార్లలో ఉన్న ప్రభుత్వ భూమిపై సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నేత కన్నేశాడు. పేర్నమిట్ట సర్వే నంబర్ 392/2,393లో 11.40 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో వాగు పోరంబోకు, డొంక, చుక్కల భూమిగా నమోదైన ఈ భూమిపైనే ఇప్పుడు అధికార పార్టీ నేత కన్ను పడింది. సదరు నేత గతంలో ఆ భూమి తనకు చెందినదిగా కోర్టులో కేసు వేశాడు. గతంలో ఆ ప్రభుత్వ భూమిలో గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్మించిన క్రమంలో రెవెన్యూ అధికారులు స్పందించి కూల్చి వేశారు. ఆ భూమి సదరు అధికార పార్టీ నేతది కాదని కోర్టు ఆ కేసును కొట్టివేసింది. చేసేదేమీ లేక ఆ నాయకుడు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారికి 'ఆ భూమి నాది.. మీరు శుభ్రం చేసుకొని ఇల్లు వేసుకోండి' అని చెప్పి గతంలో తమకు ఇచ్చిన పట్టాలకు అన్యాయం చేస్తున్నారని పట్టా పొందిన వ్యక్తులు వాపోయారు. 392/2,393 సర్వే నంబర్లు లో ఉన్న ఆ భూమిని గతంలో కుటుంబ నియంత్రణ చేసుకున్న వారికి ఒక్కొక్కరికి 50 సెంట్లు ఇచ్చారని బుధవారం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి ఇచ్చిన పట్టా భూముల్లో బాగు చేస్తున్నారు అని రాత పూర్వకంగా అర్జీ ఇచ్చారు. భూ కబ్జాపై 40వ డివిజన్ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంతనూతలపాడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా సబ్ కలెక్టర్, కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు, నిజమైన అర్హులకు న్యాయం చేయాలని, ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాతలారా.. దయచూపుతారా..

- అంధత్వ సమస్యతో బాధపడుతున్న దంపతులు
- గుండె జబ్బుకు వైద్యం చేయించుకుంటున్న ఇజ్రాయేల్
- భార్యకు దీర్ఘకాలిక వ్యాధులతోపాటు మందగించిన చూపు
- దాతల సహకారం కోసం దీనంగా ఎదురుచూపులు


ఇజ్రాయేల్ దంపతులు

దర్శి: దర్శిలో దేవుని పరిచర్యలు చేస్తూ జీవనం సాగించే కోలా ఇజ్రాయేల్ నాలుగేళ్ల వయసులోనే చూపు కోల్పోయాడు. తన 12 ఏట నుంచి బైబిల్ వాక్యాలు చెబుతూ పూర్తిగా దేవుడి పరచర్యకు అంకితమయ్యాడు. ఈ క్రమంలో విశ్వాసులు అందించే కానుకల్లో ఖర్చులకు కొంత డబ్బుపోనూ మిగిలిన సొమ్మును సామాజిక సేవలకు ఉపయోగిస్తూ వస్తున్నాడు. 2019లో మేరీ అనే మహిళను వివాహం చేసుకుని శివరాజనగర్‌లోని వికలాంగుల కాలనీలో నివాసం ఉంటున్నాడు. అంధుడైన ఇజ్రాయేల్‌కు భార్య మేరీ చేదోడు వాదోడుగా నిలిచింది. ఈ తరుణంలో ఇజ్రాయేల్‌కు గుండె సంబంధిత సమస్య రావడంతో వైద్యుల సూచన మేరకు మాత్రలు మింగుతూ వస్తున్నాడు. అందుకుగాను ప్రతి నెలా రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. భార్య మేరీకి ప్రస్తుతం పూర్తిగా కంటి చూపు మందగించింది. దీర్ఘకాలిక రుగ్మతల బారినపడిన ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కంటి చూపు రావాలంటే ఆపరేషన్ చేయాలని, అందుకు రూ.50 వేలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఈ అంధ దంపతులు హతాశులయ్యారు. ఇద్దరూ కళ్లు కనిపించని వారు కావడంతో రోజూ కష్టాలు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో పోషణ కూడా కష్టంగా మారింది. వీరికి బంధువులు, కుటుంబ సభ్యులు లేకపోవడంతో తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైద్య సహాయం అందించే దాతల కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. సాయం చేసేవారు 9959114931ను సంప్రదించాలని దీనంగా వేడుకుంటున్నారు.

నిబద్ధతతో సేవలందించండి

- జీజీహెచ్ వైద్యులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా


జీజీహెచ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలకు ఎక్కువగా నిరుపేద, సామాన్య ప్రజలు వస్తుంటారని, ఈ నేపథ్యంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది క్రమశిక్షణతో నిబద్ధతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలతో సమావేశమయ్యారు. జిల్లా ఆసుపత్రి నిర్వాహణ, అందిస్తున్న సేవలపై సమీక్షించారు. విభాగాల వారీగా ఆసుపత్రి నిర్వాహణకు అవసరమైన బడ్జెట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో మరింత గౌరవం పెంచేలా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని, వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెర్ఫార్మెన్స్ ఇండికేటర్‌లో మంచి ప్రతిభ కనబరచాలని చెప్పారు. జిల్లాలోని ప్రధాన ఆసుపత్రుల్లో ఓపీ సేవలు, ల్యాబ్ టెస్టులు, ఐపీ సేవల సామర్థ్యాన్ని పెంచాలని చెప్పారు. ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలను సమకూర్చేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ముగ్గురికి ప్రత్యేక బడి అవసరమా అండి!


ముగ్గురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

చిత్రంలో కనిపిస్తున్నది కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ పరిధిలోని ముష్ఠ గంగవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. తరగతి గదిలో ముగ్గురు విద్యార్థులే ఉన్నారేంటి అని ఆశ్చర్యపోకండి. హాజరు పట్టికలో మాత్రం ఆరు పేర్లుంటాయిలెండి. ఈ ముగ్గురు చిన్నారులకు పాఠాలు బోధించేందుకు ఒక ఉపాధ్యాయుడు, మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలు పనిచేస్తున్నారు. కేవలం ముగ్గురు విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఆ ఉపాధ్యాయుడు సైతం ఇబ్బంది పడుతున్నారు. రూ.లక్షల రూపాయల ప్రజా ధనం వృథా చేసేకన్నా ఆ ముగ్గురిని సమీపంలోని మరో పాఠశాలకు పంపితే బాగుంటుందన్న అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది. విద్యార్థుల సంఖ్య తగినంత లేని పాఠశాలలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాల్సిన విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలొస్తున్నాయి. కాగా.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలను సమీపంలోని స్కూళ్లలో విలీనం చేస్తే కూటమి నేతలు ఏదో జరిగిపోతోందని గగ్గోలు పెట్టారు. ఇప్పుడు దీనికి ఏం సమాధానం చెబుతారో? – కురిచేడు

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎం.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీఎంఎంఎస్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్ పుస్తకం, పాస్ పోర్టు సైజు ఫొటో ఉండాలన్నారు. జనరిక్ మెడికల్ దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకునే వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్టు సైజు ఫొటోతోపాటు ఫార్మసి డిగ్రీ లేదా డిప్లమో ధ్రువీకరణపత్రం జత చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వయసు 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. అర్హులైన వారు ఈ నెల 19వ తేదీలోగా గ్రామ, వార్డు సచివాలయాలు లేదా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ యువజనోత్సవాలకు జిల్లా విద్యార్థులు


జాతీయ స్థాయి యువజనోత్సవాలకు ఎంపికైన విజేతలను అభినందిస్తున్న సీఈఓ శ్రీమన్నారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు సిటీ: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జనవరి 4, 5 తేదీల్లో పరోక్ష విధానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో ప్రకాశం జిల్లాకు సంబంధించిన సైన్స్ ప్రాజెక్టు, డిక్లమేషన్‌లో ప్రథమ స్థానంలో ఎంపికైనట్లు స్టెప్ సీఈఓ పి.శ్రీమన్నారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఏకేవీకే జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఎస్.రవిశ్రీశంకర్, హంసిక వారి అధ్యాపక బృందం సహాయంతో ఇంటర్‌నెట్‌తో సంబంధం లేకుండా కేవలం కాంతి ద్వారా డేటా ట్రాన్స్‌ఫర్ చేయడం అనే అంశం మీద సరికొత్త ఆవిష్కరణలతో ఈ ప్రాజెక్టును తయారు చేశారని తెలిపారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థి అయిన డి.వంశీ తన ఉపన్యాసంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొంది ఎంపికై జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి విజేతలు జనవరి 11, 12 వ తేదీల్లో ఢిల్లీలోని భారత మండపంలో జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విజేతలను స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, ఏకేవీకే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనీల్‌రెడ్డి అభినందనలు తెలిపారు.